

# అగ్నిగుండం

ఎ శ్రీదేవి

"కొత్త వూరు కొత్త యిల్లు... హడావుడి అదుర్దా పాపని పడుకోబెట్టి సామాన్లన్నీ సర్దేసరికి ఒళ్ళంతా హూనమైపోయింది. డ్యూటీలో జాయినవ్వాలని ఆయన పదిగంటలకే వెళ్ళిపోయాడు. ఎదురింటి మాష్టారి భార్య పార్వతమ్మ చిటికెలో పరిచయమైంది. ఆ కబురూ యీ కబురూ చెప్తూ సామానులు సర్దటంలో సాయపడింది.

సాయంత్రం నాలుగవుతుండగా సర్దటం ఆపేసి అలసటగా మేను వాల్చాను. పక్క వాటాలో ఎవరో కూని రాగాలు తీస్తున్నారు.

"నల్లనివాడు... పద్మ నయనంబుల వాడు... వరుణాద్వేపవత్ తటాంజలమునన్...శయష్ట జాంబుజము తఘటించడబడన్" ఇలా వరుసగా పద్యాలు వినిపిస్తూనే వున్నాయి. నేను మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

సాయంత్రం ఆరు దాటుతుండగా ఆయనెవరో ఆఫీసు వాళ్ళని తీసుకొచ్చారు. పరస్పర పరిచయాలు, కాఫీలు యాంత్రికంగా పనిచేస్తున్నానేగానీ. నా దృష్టంతా పక్క వాటాలోనుంచి వినిపిస్తున్న పద్యాలమీదే వుంది. ఆయన స్నేహితులతో వెళ్ళిపోయాక వంట ప్రయత్నంలో పడ్డాను.

కుర్చీ కిర్రుమన్న శబ్దం... వుండుండి నవ్వు! నడిచినట్లు అడుగుల చప్పుడు, పుస్తకాలు కిందపడేసిన శబ్దం... పేజీలు విసురుగా తిప్పుతున్న ధ్వని...

మావారు యింటికి రాగానే అడిగేశాను యీ మిస్టరీ యేవిటోనని- ఆయన నా వంకొకసారి తేరిపార జూసి- "అప్పుడే మొదలుపెట్టావా కథలకి నీ పాట్లు వెదుక్కోవటం నీపాట్లు చూడలేక పోతున్నా నేను. కొన్నాళ్ళు నీ బుర్రని అద్దెకిస్తే బావుండేమో" అన్నారు పాపని చేతుల్లోకి తీసుకొని...

నాకు ఒళ్ళు మండిపోయింది అడి గిన దానికి దేనికీ సక్రమంగా జవాబు చెప్పరు కదా" విసుక్కున్నాను.

రచయిత్రీ శాంతించు. వివరాలు త్వరలో కనుక్కొని తెలిపెదను" అన్నారు గాటకపక్కిలో...

ఇహ యీయనగారితో లాభం లేదనుకుని పార్వతమ్మగారినే అడగా లనుకున్నాను" మనసులోనే...

భోజనం చేసి ఆయన నిద్రలోకి జారి పోయారు నాకు మాత్రం ఒక పట్టాన నిద్రపట్టలేదు. ఏదన్నా సందేహం మన సులో దూరిందా...అది తీరేదాకా నిద్ర రాదు నాకు...

రావోయి చందమామా ... మా వింతగాధ వినుమా"- "రావే ... రావే ఒయ్యారి గాభేతి..."

పక్కింట్లో గొడవ ప్రారంభమైంది.

ఇక పడుకోవే తల్లీ" ఒక వృద్ధు రాలి కంఠం వినిపిస్తోంది.

నే పడుకోను పో...యిది పూర్తి కావాలి గారాబంగా గునుస్తూ పద్యాలు చదువుతోందామె

సకల చరాచర ప్రకృతి నిద్రాదేవి గాఢపరిష్వంగంలోకి ఒదిగిపోయేవేళ కీచురాళ్ళ సంగీతం తప్ప మరేమీ విని పించటం లేదు! తారలు తళుకుతళుకు మంటూ నిక్కినిక్కి చూస్తున్నాయి... నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఆమెగొంతు విని పిస్తూనే వుంది

నేను కుతూహలం ఆపుకోలేక తలుపు సందుల్లోనుంచి అవతలకి చూశాను! అవతలి దృశ్యం చూసి నా గుండె ఝల్లుమంది. శరీరం స్తంభించి పోయింది...

దాదాపు ముప్ఫయ్యేళ్ళున్న స్త్రీ నగ్నంగా వుంది. భుజాల వరకూ వేలాడు తున్న జుట్టు, గుండ్రంగావున్న శరీరం పొట్టమీదకి జారిపోయి వేలాడుతున్న వక్షోజాలు. ఒక చేతిలో పుస్తకాలు మరో చేతిలో లాంతరు- చిన్నసైజు పిశాచిలా వుంది...

ఆమె చుట్టూ చిందరవందరగా పడేసిన పుస్తకాలు-చాలా బిజీగా యేదో ముఖ్యమైన పనున్న దానిలో అటూ యిటూ తిరుగుతోంది. హఠాత్తుగా నిల బడి సీరియస్‌గా ఆలోచిస్తోంది. చటు క్కున కుర్చీలో కూర్చుని గట్టిగా వూగుతూ నవ్వుతోంది:

'పిచ్చిది కాబోలు' అన్న ఆలోచన రాగానే నా గుండె ఝల్లుమంది

గబగబా వచ్చి మంచంమీద పడు కున్నాను. కళ్ళు గట్టిగా మూసుకున్నా నిద్ర రావటంలేదు. ఇందాకటి దృశ్యమే కనులముందు కదులుతోంది. పిచ్చి వాళ్ళంటే భయంలేదు గానీ... సాను భూతి వుంది. వాళ్ళ జీవితాలు అలా యెందుకు తయారయ్యాయో తెలుసు కోవాలన్న కుతూహలం వుంది. ఆమెని గురించి ఆలోచిస్తుండగా యే అర్ధ రాత్రికో నిద్ర పట్టేసింది

మరునాడు ఆదివారం పక్కవూళ్లో తన ఫ్రెండుని చూడవస్తానని వెళ్ళిపోయారాయన. పనంతా చకచకా పూర్తి చేసి...పార్వతమ్మగారి కోసం ఆత్రంగా చూస్తూ కూర్చున్నాను.

పదకొండు గంటల సమయంలో ఆవిడ చిరునవ్వుతో రానే వచ్చింది.

"ఏమ్మా! రాత్రి బాగా నిద్రపట్టిందా? కొత్త ప్రదేశం కదూ? మొదట్లో అలాగే వుంటుంది. క్రమక్రమంగా అలవాటయిపోయి పాత పరిసరాలు, పరిచయాలు మర్చిపోతాం" పలకరింపుగా చనువుగా అంది.

ఆవిడ వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోయాను. ఏది చెప్పినా, స్పష్టంగా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పటం ఆవిడ ప్రత్యేకత...

రాత్రి జరిగినదంతా ఆవిడతో చెప్పాను.

ఆవిడ బాధగా నిట్టూర్చింది. "ఏవిటో కొన్ని బ్రతుకులు అలా తెల్లారిపోవలసిందే" అంది వేదనగా...

"మొదట్నుంచీ యింతేనా!" నా ప్రశ్న విని కాదన్నట్లుగా తలూపింది.

"అమ్మాయి పేరేవిటి?" నేను ఆత్రంగా అడిగేశాను! ఆవిడ యేదో ఆలోచిస్తూ...ఆగి ఆగి చెబుతోంది.


"మృణాళిని" 'ఎంత చక్కని పేరు' అనుకున్నాను.

మనిషకూడా అలాగే వుండేదమ్మా తల్లి కలువపూవులా స్వచ్ఛమైన మనసు. పాదరసంలాంటి బుద్ధి. ఒక్కసారి విన్నదంటే చాలు ఇట్టే పట్టేస్తుంది. ఎంత కఠినమైన పద్యమైనా...ఏ విషయమైనా...ఆపిల్ల గొంతు విప్పి పద్యాలు పాడుతుంటే...ఎంత కమ్మగా వుండేదనుకున్నావు" ఆవిడ కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. ముఖమంతా బాధావీచికలు అలముకున్నాయి.

"అంత తెలివిగల పిల్లకి యింత దుర్భరస్థితి?" నాలో నేనే ఒణికిపోయాను.

"అంతా ప్రారబ్ధం. దీనికి ఆరేళ్ళ వయసులోనే తల్లిపోయింది. తండ్రి మళ్ళా పెళ్ళి చేసుకున్నాడు. ఆ తండ్రి విద్వత్తు, ఆ తెలివితేటలూ, యీ పిల్లకి వచ్చాయి. అయినా యేం లాభం అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. మోటువాడికి మొగలిపూవు విలువ యేం తెలుస్తుంది?"

'నేను మధురవాణిలాగా, రామచంద్రుడిలాగా కావ్యాలు రాస్తాను అత్తయ్యా' అంటూ నాతో చెప్పి తెగ మురిసిపోయేది అమాయకురాలు. దాని ఆశలన్నీ యే గంగలో కలిపేశాడో భగవంతుడు" ఆవిడ బాధగా కళ్లు తుడుచుకుంది. గత స్మృతులని తలుచుకుంటూ ఆవిడ ఆవేదనతో కుమిలిపోతున్నదని అర్థమైపోయింది నాకు!



"ఆ వచ్చిన సవతితల్లికి విద్యా గంధం లేదు. సంస్కారమూ అంతంత మాత్రమే. ఈ పిల్లని చూస్తే సరిపడేది కాదు. ఎప్పుడూ పుస్తకాలు పట్టుక్కూచుంటే యింట్లోపని యెవడు చేస్తాడూ" అంటూ విరుచుకుపడిపోయేది. అయినా ఆశ చంపుకోలేకపోయింది చదువు మీద. అందరూ నిద్రపోయాక దీపం వెలిగించుకుని చదువుకునేది: అప్పట్లో కరెంటు రాలేదీపల్లెకి. ఆవిడ ఆంక్షలు పెడుతున్నకొద్దీ యీ పిల్లలో విద్యాకాంక్ష పెరిగిందేగానీ తరగలేదు..."

వింటున్న నాకు మనసంతా ద్రవించిపోయేది...ఒక బలీయమైన కోర్కె... గాఢమైన విజ్ఞానతృష్ణ! జీవితాన్నెంతగా మార్చివేస్తుంది?..."

"దినదినగండం నూరేళ్ళాయుస్సు లాగా పెరిగిందీ పిల్ల. ఒక హైస్కూలు మాష్టరు చేతిలోపెట్టి తన బాధ్యత తీరిపోయిందనుకున్నాడు తండ్రి-

"అత్తగారింట్లో నయినా హాయిగా చదువుకుందామని ఆశిస్తే- అక్కడా చుక్కెదురే అయిందీ నిర్భాగ్యురాలికి. అత్త నోటిదురుసు మనిషి, కొడుకుమాట సాగనిచ్చేది కాదు. కోడలు తను చెప్పినట్లే వినాలనేది. మృణాళిని ఆ యిరుకు మనుషుల్లో యిమడలేకపోయింది.

నా మనసంతా అదోలా అయిపోయింది. మన దేశంలోని ఆడపిల్లల పరిస్థితి- నాడూ నేడూ ఒకే లాగుంది. కొద్దిపాటి మార్పులతో...

"బావగార్లు, మరుదులు, ఆడబడుచులూ వున్న లంకంత సంసారం అది ఒళ్ళు హూనమయ్యేటట్లు చాకిరీ చేసిన తెమలని పని.

"రాత్రి ఏ పదిగంటలకో పడకటిల్లు చేరి పుస్తకం ముట్టుకోగానే భర్త 'రా రమ్మంటూ' పిలిచేవాడు ఇంకేం నెరవేరుతుంది దాని ఆశ...

"అంత బాధలోనూ నవ్వొచ్చింది నాకు, పార్వతమ్మగారి మాటలకి.

"భర్త పుస్తకాలు తెస్తే అత్తగారు పోట్లాడేది. మృణాళినినేం చేయటానికీ పాలుపోలేదు. పక్కింటివాళ్ళబ్బాయి పట్నంలో చదువుతున్నాడు. అతనిచేత రహస్యంగా పుస్తకాలు తెప్పించుకుని చదువుతుండేది ? ఈ సంగతి ఎలా పసిగట్టిందో- సి.ఐ.డి లాంటి అత్త - యింట్లో పెద్ద రభస జరిగిపోయింది...

"తన మాట కోడలు వినలేదన్న కోపంతో పక్కింటి అబ్బాయి తెచ్చిన పుస్తకాలన్నీ కుప్పలుగా వేసి తగల బెట్టిందా అత్తి రాక్షసి. పక్కింటి కుర్రాడికి-నీ పెళ్ళానికీ సంబంధమున్న దంటూ కొడుక్కి నూరిపోసింది.

వింటున్న నా మనసు జళ్ళుమంది భయంతో. అటువంటి నరరూపరాక్షసులు కూడా వుంటారా అనిపించింది

వాడు చదువుకున్న మూర్ఖుడు. తల్లి మాటలకు తందానా తానా అన్నాడు. భార్యని అనుమానించి చావబాదేవాడు. ఒక్క పుస్తకంకూడా అందకుండా చేశారు...

"జీవితంలో ఒక్కసారిగా యిలా అగ్నిగుండంగా మారటంతో ఆ పిల్లకి మతి చలించిపోయింది. బలహీనమైన ఆ మనసు ఘోరమైన వత్తిడులకి తట్టుకోలేకపోయింది. సవతితల్లి యీ పిచ్చిదాన్ని చేరదీస్తుందా ? అన్నీ సవ్యంగా వున్నప్పుడే యింత కూడె య్యటానికి ఏడ్చిపోయేది ... తన సొమ్మంతా పోయినట్లు..." పార్వతమ్మ గారు వేదనాభరితంగా చెప్పుకుపోతూనే వుంది,

"మరి యింట్లోవున్న ముసలాడెవరు?" నా మనసు బాధతో విలవిల్లాడిపోతోంది. అంతర్లీనంగా వున్న వాంఛ యింత చరిత్ర సృష్టిస్తుందా?"

"ఆ ముసలామె మృణాళినికి అమ్మమ్మ. కూతురు పోయినా రక్త బంధం తెంచుకోలేక ఆ పిచ్చిపిల్లని తెచ్చి యింట్లోపెట్టుకుని కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఆ ముసలిఘటం తెల్లారిపోయినాక యీ పిచ్చిదాని బ్రతుకు యెలా తెల్లారుతుందో?..."

"బట్టలెందుకు వుంచుకోదు? ఒంటి మీద?"

ఆవిడ బాధగా పెదవి విరిచింది...

"ఉంచుకోదు తల్లీ ఎందుకో యేమో! బలవంతాన చీరకట్టినా కాసేపటికల్లా విప్పి అవతలపడేస్తుంది. అందుకే వీధి వాకిలి ఎప్పుడూ వేసే వుంచుతారు. ఎవరైనా వాళ్ళాయనయీడు మగాళ్ళు కనబడితే చాలు అపరకాళిలా విరుచుకు పడుతుంది."

"ఈ రెండు ముద్దలూ తినవే తల్లీ" ఆ ముసలావిడ బ్రతిమాలుతోంది... ఆమె మామూలు సణుగుడే-

"మా అత్త రాక్షసి. చదువుకోనీదు- నువ్వుపో అవతలికి" మృణాళిని గొంతు వినిపిస్తోంది.




"వాళ్లింటికి ఒకసారి వెళ్దామండీ" అన్నాను నా కెందుకో మృణాళినిని దగ్గరగా చూడాలనిపిస్తోంది

పార్వతమ్మ నా వంక చిత్రంగా చూసింది 'సరేలే' అంది నవ్వేస్తూ

నేనూ పార్వతమ్మగారూ వెళ్ళేసరికి మృణాళిని ఆముక్తమాల్యద చదువుతోంది ముసలావిడ మా యిద్దర్నీ సాదరంగా ఆహ్వానించి కూచోమంది

మృణాళిని చివ్వున తలెత్తి మా యిద్దరివంకా చిత్రంగా చూసింది ఆ నగ్నమూర్తిని అలా దగ్గరగా చూస్తుంటే యెన్నెన్నో భావాలు కలుగుతున్నాయి నాలో

"ఎవరండీ వరూధినికీ-ప్రవరుడకీ పెళ్లి చేస్తే ఎలా వుండేది? ఆ ప్రవరుడి దగ్గర కూర్చుని వేదాలు చదువుకునేదా? సోమిదేవమ్మకు డాన్స్ నేర్పేదా? హీహీహీ హాహాహా" నా ముఖంమీదకి వంగి నవ్వుతోంది

నగ్నంగావున్న ఆమె వక్షోజాలు నా ముఖానికి దగ్గరగా నాకు వూపిరాడనట్లే అయింది

'చక్కగా పక్కన కూర్చుని మాట్లాడాలే అలా మీద పడొచ్చా' ముసలామె మృణాళినిని నా పక్కనే కూర్చోబెట్టింది ఒక శాలువ తెచ్చి ఆమె ఒంటినిండా కప్పింది ఏమనుకుందో ఏమో బుద్ధిగా కూర్చుందామె

ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాను సౌందర్యం తాలూకు గత వైభవపు చిహ్నాలు ఆ ముఖంలో చిందులేస్తున్నాయి

"మందయానము నేర్పు ఇందింది రాజీవ రాజీవరాజన్మరాళరాజి యీ పద్యంలో సొగసు మా అత్తకేం తెలుసండీ" అంటూ ఫక్కుమని నవ్వింది

"ఏవండోయ్- యిందులో బ్రహ్మ రాక్షసున్నాడు వాడి దగ్గరకి పంపాలి మా అత్తని అప్పుడు బలేవుంటుందిలే హిహి హాహా హి" చప్పట్లు చరిచి నవ్వసాగింది

అంతలోనే ఆగిపోయి సీరియస్‌గా నావంక చూసింది

" చీకటి మడితో వంటచేసే చిలకమ్మకీ ఎదురింట్లో ఆసనాలేసే బ్రహ్మచారికీ ముడిపెట్టేస్తే దమ్మరో దమ్ నికజాయ్‌హమ్ హరే కృష్ణ హరేరామ్ రహస్యంగా అడుగుతూ పాట పాడసాగింది

"ఇదీ తల్లీధోరణి ఆ పుస్తకాల మాటలే అదే ధ్యాస మొగుణ్ణే యో గంధర్వలోకానికో పక్కింటి అబ్బాయినీ స్వర్గానికీ పంపిస్తాసంటుంది ఏవిటో యీ రాత హాయిగా పిల్ల పాపలతో సుఖంగా కాపరం చేసుకోవాలిసిన పిల్ల" ముసలావిడ బుగ్గల మీదుగా కన్నీరు జారిపోయింది గొంతు సన్నగా వణుకుతోంది

"కలకంఠి కన్నీరొలికిన సిరియింట నుండదు నొల్లదు ఎంత చెప్పినా వినదు అమ్మమ్మ కదండీ ఏవండోయ్ అయ్యారే చెలువెక్కడ- అయ్యారే గెలువజాలునంగజునారిన్! ఆహా ఏం అలంకార ప్రయోగమండీ "

"ఇంద్రచాపలరోచి జూచి .. తల యూచి చిరసోభితంబుగన్ అలా గుండాల అందమంటే కామాక్షి మొగుడూ వుంటాడు ఉడత ముఖం వాడూనూ కామాక్షికి వాడిచి చూస్తే దోకు అందుకే వాళ్ల మామయ్యంటే దాని కిష్టం

"అబ్బో పూజారిగారిది ఎఱుగుబంటు శరీరం వాళ్లావిడ వెన్నెలరెమ్మ వాళ్లిద్దరూ వెళ్తుంటే హీహీహీ హాహాహా"

గట్టిగా నవ్వుతోందామె స్తనాలు చిత్రంగా కదలిపోతున్నాయి ముందుకి పడుతున్న జుట్టుని నిర్లక్ష్యంగా వెనక్కి తోసుకుంది ఆ కళ్లు వుండుండి ఏవో మెరుపులు కురిపిస్తూనే వున్నాయి పూర్వజన్మ వాసన సంస్కారపు వాసన్యలా హృదయాన్నింకా వీడిపోలేదనిపిస్తోంది

భౌతిక శరీరంపై శ్రద్ధలేకపోయినా, హృదయంలో విరసిన సంస్కార సుమాలని విజ్ఞాన సౌరభాలని అపురూపంగా చూసుకుంటోంది మృణాళిని నిరంతరం ఆ సాహిత్యాధ్యయనంలో ఆమె పొందే బ్రహ్మానందం అడవుల్లో ముక్కు మూసుకొని తపస్సు చేసుకునే మునులకు, విజ్ఞాన తృష్ణలో విచిత్రంగా ప్రవర్తించే యీ మృణాళినికి యేవిటి భేదం? నా మనసు తర్కంలో పడిపోయింది

భారమైన హృదయంతో వెనక్కి తిరిగి వచ్చేశాను

* * *

మూడునెలలు అలా గడిచిపోయాయి మృణాళిని ఎంతో సన్నిహితురాలిగా అనిపిస్తోందిప్పుడు

ఒకరోజు సాయంత్రం మావారు చాలా సంతోషవార్త చెప్పారు ఆయన ముఖం ఆనందంతో వెలిగిపోతోంది మనం ఎంతో అపురూపంగా స్నేహంగా చూచుకునే వ్యక్తులు సుఖసంతోషాలతో వుంటున్నప్పుడు కలిగే ఆనందమది .

"మా పెద్దమ్మ కోడికోడలు కూతురు అనూరాధ గుర్తుందా?' అన్నారు వుత్సాహంగా చూస్తూ.

"ఆఁ అన్నాను" సన్నగా తెల్లగా సన్నజాజిమొగ్గలా వుండే అనూరాధ తెలివి, చురుకుదనమూ కలబోసినట్లు వుంటాయి మాటలు ఆ పిల్లంటే మా వారికి చాలా మక్కువ ఆయనకి చెల్లెళ్ళు లేరు ఆ పిల్లని సోదరిగా అభిమానించి ఆప్యాయత చూపేవారు ఆమె పెళ్లికి వెళ్లలేకపోయినందుకు చాలా బాధపడ్డారు అప్పట్లో

"అనూరాధ సింగరాయకొండలో వున్నదట చూసొద్దాం ఎంత పదిమైళ్లేగా అన్నారు నా అంగీకారంకోసం ఎదురు చూస్తూ లేనివాటికోసం ఆరాటపడిపోవటం ఆంగలార్చటం మానవసహజం కాబోలు! అనుకున్నాను

చిన్న పెంకుటిల్లు చుట్టూరా కనువిందుచేసే పూలమొక్కలు నిరాడంబరంగా వున్న గదులు మమ్మల్ని చూస్తూనే చిరునవ్వుతో ఎదురొచ్చింది అనూరాధ చేతిలో పిల్లాడ్ని మావారికిస్తూ, "ఇన్నాళ్ళకి గుర్తొచ్చానా అన్నయ్యా ?" అంది ఆర్ద్రంగా నిట్టూర్పు వెనక దాగిన అపురూపమైన మమకారం

ఆమె ఏది మాట్లాడినా పొందికగా — అవ్యక్త మధురమైన సంగీతం వింటున్నట్లుగా వుంటుంది తన పెళ్ళికి రానం

దుకు వాళ్ళ అన్నగారిమీద అలిగింది నామీద ప్రేమ ఒలకబోసింది పాపని ముద్దులాడుతూ ఆప్యాయంగా పలకరించి ఎన్నో కబుర్లు చెప్పింది

'రాధమ్మా యిటురావే" ఒక వృద్ధు రాలి కంఠం లోపలనుంచి వినిపించింది

'ఎవరూ ?" అడిగాను

"మా అత్తగారు పక్షవాతం మంచంలో నుంచి లేవలేదు ఇప్పుడే వస్తాను, నువ్వు కూర్చో వదినా" అంటూ లోపలికెళ్ళింది

అనూరాధ భర్త పెద్ద అందగాడు కాకపోయినా సహృదయుడిలా కనిపించాడు

గోడలకి వేలాడుతున్న ఫోటోలను చూస్తూ వుండిపోయాను అన్నిటిలోకి నన్ను ముఖ్యంగా ఆకర్షించిందొక ఫోటో బహుశా అనూరాధ ఆడబిడ్డ కాబోలు అనుకున్నాను

"ఫొటో పాతగా వున్నా ఆ సౌందర్యం మహత్తరంగా వుంది కొంత సేపటివరకు చూపులు తిప్పుకోలేక పోయాను అడుగుల చప్పుడు వినిపించి వెనుదిరిగి చూశాను అనూరాధ భర్త రామచంద్రరావు ఆ ఫొటోవంక సజల నయనాలతో చూస్తున్నాడు

"ఈ ఫొటో ఎవరిదండీ ?"

కుతూహలంగానే ముఖంచూసి బరువుగా నిట్టూర్చాడు అపరాధిలా నావంక చూశాడు

"ఒక నిర్భాగ్యురాలిది" అంటూ అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయాడు నేను తెల్లబోయి నిల్చున్నాను. ఇంతలో అనూరాధ రానేవచ్చింది

"ఆ ఫొటోలో ఆమె బావుందికదూ?" అన్నది

"అవును చాలా బావుంది కవులు వర్ణించే ప్రబంధసుందరిలా వుంది" అన్నాను ఆ భావోద్వేగంనుంచి తేరుకోలేక

"మీ అన్నయ్యగారు గానీ రాలేదు కదా" అంది కంగారుగా

"వచ్చి చూశారు" అని జరిగింది చెప్పాను

అనూరాధ ముఖంలో నీలి నీడలు కమ్ముకున్నాయి "ఆమె మావారి మొదటి భార్య" అంది బరువుగా


నా పక్కనే బాంబుపడ్డట్లు ఉలిక్కిపడ్డాను "అంటే ఆమెను మరచిపోలేక నేను "

నా మాటను సగంలోనే తుంచేసింది అనూరాధ "అదేంలేదుగానీ ఒకప్పుడు అజ్ఞానంతో, మూర్ఖత్వంతో చేసిన పనికి ఒక అమాయక జీవి బలయిపోయిందని యిప్పటికీ బాధపడుతుంటారు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే యేం ప్రయోజనం ?'

"అంటే అవిడ యిప్పుడు

"బ్రతికే వుంది—జీవచ్ఛవంలా

"అంటే ఆమెకు విడాకు లిచ్చి నిన్ను




"ఈయన ఏ ఆకులిచ్చినా ఆమె తెలుసుకునే స్థితిలో లేదు" ఆవేదనగా అంది.

"అంటే—ఏమైందావిడకు?"

"మతి చలించింది. తల్లి మాటలు గుడ్డిగా నమ్మి ఆ పిల్ల జీవితం నాశనం చేశారు. తీరని కోరికలతో దుర్భరమైన మానసిక సంఘర్షణతో ఆమెకి మతి భ్రమించింది; చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తోంది మా అత్తగారు" లోపల గది వైపు వేలుపెట్టి చూపించింది అనూరాధ.

"ఆమె పేరు?"

"మృణాళిని—టంగుటూరులో వాళ్ళ అమ్మమ్మ దగ్గర వుంటోంది." శూన్యం లోకి చూస్తూ బాధగా అంది అనూరాధ.

నాకు కళ్ళముందు మెరుపు మెరిసి నట్లయింది. రెండు అగ్నిపర్వతాలు ఢీకొన్న సంఘర్షణ మనసులో...

అలా అడగకూడదన్న జ్ఞానంకూడా లేకుండా అడిగేశాను "అనూ! మీవారు నిన్ను బాగా చూసుకుంటారా" ఆందోళనగా వున్న నా ముఖంచూసి ఫక్కుమని నవ్విందామె.

"చాలా బాగా చూసుకుంటారు. అత్తగారు నామీద ప్రతాపం చూపించబోయిందిగానీ నేను లొంగలేదు. ఎదురు తిరిగాను. ఈ చాకిరీ అంతా నావల్ల కాదని ఖచ్చితంగా చెప్పేశాను. భయపడి అడుగులకి మడుగులొత్తటానికి నేను మృణాళినిని కాదుగా. పరిస్థితంతా మా వారికి విప్పిచెప్పి వేరు కాపురం పెట్టించాను. కిక్కురుమనలేదు. మరుదులు పక్షపాతం వచ్చిందనీ ముసలామెకి చాకిరీ చేయలేమనీ మెల్లగా ఆమెని బయటికి గెంటేశారు."

"మనకీ బాధ్యతలు తప్పవుగా."

చేసిన పాపాలకి ఆవిడ ఇప్పుడు అల్లాడిపోతోంది. సరిగా నిద్ర కూడా పోదు ఆ కోడల్ని తల్చుకుని కుమిలి కుమిలి యేడుస్తుంటుంది ఏం లాభం?

చేజారిన రత్నం తిరిగి దొరకటం అంత సులభం కాదు" అనూరాధ దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఎంత చిత్రమైన జీవితాలివి? ఎవరెవరికి ఎక్కడెక్కడ ముడివేస్తాడు? ఎందుకు విడదీస్తాడు? ఏమిటీ సృష్టి విచిత్రం? లాంతరు, పుస్తకాలు పట్టుకుని తిరిగే ఆ నగ్నమూర్తికి ఈ ఫొటో లోని సౌందర్యరాశికీ యెంత తేడా? పరిస్థితులు వ్యక్తుల్నెంత ఘోరంగా వంచిస్తాయి? నా మనసు ఆవేదనతో వేగిపోయింది

ఇదంతా విన్నట్టున్నారు మావారు. నిశ్శబ్దంగా లోపల కొచ్చి కుర్చీలో కూర్చున్నారు విచారంగా.

"ఎవరే ఆ అమ్మాయి వచ్చింది? ఇటు రమ్మను మన బంధువులా?" లోపల నుంచి ముసలావిడ గొంతు ఆరాటంగా వినిపిస్తోంది. ఆ గొంతులో ఇంకా జీవితాశ....—

ఆ కంఠస్వరం వింటుంటే నాకు భయంతో ఒళ్ళు జలదరించినట్లయింది. మృణాళిని ఎదురుగా నిలబడి "మా అత్తని బ్రహ్మరాక్షసుడి దగ్గరకి పంపేయ్యాలి" అని పగలబడి నవ్వుతున్నట్లే అనిపించింది. నిలువెల్లా కంపించిపోయాను.

"వదినా! చూస్తావా మా అత్తగారిని? తన సొదంతా వెళ్ళబోసుకుంటుంది" అనూరాధ అడుగుతోంది.

నా కామె గదిలోకి వెళ్ళాలనిపించ లేదు. శాపగ్రస్థమైన మృణాళినిని తలచుకుని నా మనసు బాధతో భగ్గుమంది.

అనూరాధ జీవితమన్నా హాయిగా సాగిపోవాలని మనసారా కోరుకున్నాను.

